ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

శనివారం 3 జనవరి 2026 8 పేజీలు


ప్రకాశం


బాపట్ల


మార్కాపురం

7న 'వెలిగొండ'కు సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు వెలిగొండ ప్రాజెక్టు సందర్శించనున్నారని తెలిసింది. యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు గ్రామ సమీపాన గల పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు సొరంగ మార్గాల పనులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించనున్నారు. అనంతరం అధికారులతో సమీక్షించనున్నారు. ఈ మేరకు అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది.



మార్కాపురంలో..

సిఐటియు బహిరంగ సభ జయప్రదం కోరుతూ..

ఎర్ర బెలూన్లు ఎగరవేత

3లో

ప్రాధాన్యత కోల్పోతున్న జడ్పీ

- కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల గైర్హాజరే కారణం
- సమస్యలపై చర్చలు తప్ప పరిష్కారాలపై స్పష్టత ఏదీ.?
- వైరి వర్గాలుగా మారిపోయిన జడ్పీ పాలకవర్గం, కూటమి వర్గం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాపరిషత్ అంటే ఒకప్పుడు ఎంతో ప్రాధాన్యత ఉండేది. రాజకీయాల కంటే అక్కడ క్షేత్రస్థాయి సమస్యలపైనే ఎక్కువ చర్చ సాగేది. మండలస్థాయి ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన అంశాలకు నేరుగా జిల్లాస్థాయి అధికారులు సమాధానాలు చెప్పే వేదిక కూడా ఇదే.. ఉన్నతస్థాయి చర్చలు, సమీక్షలు నిర్ణయాలు ఇక్కడే జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయింది. జిల్లాపరిషత్‌లో ఇప్పుడు రాజకీయ వ్యూహాలే కీలకంగా ముందుకు వచ్చాయి. సహజంగా అధికారంలో ఉండే పార్టీల చేతిలోనే జిల్లాపరిషత్ కూడా ఉంటుంది. వైసిపి హయాంలో జడ్పీకి ఎన్నికలు జరగ్గా వైసిపి ఏకపక్షంగా పాలకవర్గాన్ని కైవసం చేసుకుంది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ కూడా చేయలేదు. ఎన్నికలను బహిష్కరించారు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చింది. జడ్పీ పాలకవర్గంగా ఉన్న వైసిపి ఇప్పుడు ప్రతిపక్షంలోకి చేరింది. దీంతో ఇక్కడ రెండు పక్షాల మధ్య వైరం కొనసాగుతోంది. జడ్పీ ప్రతిపక్షంగానూ, కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు పాలకవర్గంగా ఇప్పుడున్నారు. దీంతో ఇక్కడ సమస్యలపై చర్చల కంటే రాజకీయ వ్యూహాలే నడుస్తున్నాయి. ఎవరి పంథాలో వాళ్లున్నారు. మొదట్లో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కొందరు జడ్పీటీసీలు జడ్పీలో ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రారంభించారు. ప్రోటోకాల్‌పై పెద్ద దుమారం రేగడంతో కూటమి నేతలు ఓ నిర్ణయానికి వచ్చారు. ఆ సమావేశానికి వెళ్లడం దండగనే అభిప్రాయానికి వచ్చారు. దీంతో రెండు పర్యాయాలుగా సమావేశాలకు తెలుగుదేశం మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకావడం లేదు. దీంతో అధికారులు కూడా అక్కడ సీరియస్‌గా ఉండటం లేదు. చట్టప్రకారం పోకుంటే ఉద్యోగరీత్యా ఇబ్బందులు వస్తాయనే భావన తప్ప జడ్పీలో జరిగే చర్చలకు సమాధానాలు ఇచ్చే రీతిలో మాత్రం అక్కడ కనిపించడం లేదు. కొన్ని అంశాలపై పదేపదే అడుగుతున్నా సమాధానాలు కూడా నామమాత్రంగానే ఉంటున్నాయి. మంత్రులు హాజరుకానందున అక్కడ చర్చలపై శ్రద్ధ తగ్గింది. ఒక వేళ వెళ్ళినా వైసిపి సభ్యులు ప్రతిపక్షంలో ఉన్నందున దాడి తప్ప ఏమీలేదనే భావనలో ఉన్నారు. దీంతో జిల్లా పరిషత్ సమావేశం అంటేనే మొక్కుబడి వ్యవహారం అన్న చందంగా మారింది. ఎజెండా పేరుకు తప్ప అక్కడ చర్చ కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇంకా చెప్పాలంటే ఏదో జరగాలంటే జరగాలన్నట్లుగానే కనిపిస్తోంది. శనివారం నాడు జరిగే జడ్పీ సమావేశంలో2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. రూ.28 కోట్లతో బడ్జెట్ అంచనాలు రూపొందించారు. దీంతో పాటు విద్యుత్, వ్యవసాయశాఖ, మొంథా తుఫాను నష్టాలు, గ్రామీణనీటి సరఫరా, సోషల్ వెల్ఫేర్, ఇతర కీలక శాఖలను ఎజండాలో పెట్టారు. వీటిపై ఏ మేరకు చర్చ సాగుతుందో చూడాలి. తెలుగుదేశం మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారా? లేదా? అనేదీ స్పష్టత లేదు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

తర్వాత అందరూ సమానమే..

- చట్టాన్ని ఉల్లంఘించినందుకే.. ప్రజలు వాళ్లను ఇంటికి పంపారు..
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్


పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-పంగులూరు

'గత ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించి పనిచేసింది.. పాస్ పుస్తకాలపై వాళ్ల ఫొటోలు వేసుకొని రైతులకు ఇచ్చారు.. అందువల్లే ప్రజలు వాళ్లని ఇంటికి పంపారు. తరతరాల నుంచి వచ్చే ఆస్తి హక్కు పుస్తకాలపై ఉంటే తండ్రి ఫోటో ఉండాలి.. లేకుంటే రాజముద్ర ఉండాలి. హక్కుదారుల ఫోటోలు లేకుండా జగన్ బొమ్మలు పాస్ పుస్తకాలపై వేసుకున్నాడు' అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజలందరూ సమానమేనని చెప్పారు.

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో సమాజంలోని అసమానతలు రూపుమాపేందుకు సిఎం చంద్రబాబునాయుడు కషి చేస్తున్నారని చెప్పారు. అందులో భాగమే పి4 అని మంత్రి గొట్టిపాటి అన్నారు. పి4 ద్వారా అనేక సంస్థల నుండి నిధులు సేకరించి పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అసమానతలు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా నియోజకవర్గంలో 20 కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. తూర్పు తక్కెళ్ళపాడులో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించినట్లు చెప్పారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు రూ.10 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మించామని, రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు వేశామని, మరికొన్ని సిమెంట్ రోడ్లు వేయడానికి రూ.20 లక్షలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. మంచినీటి పథకానికి అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని అన్నారు. పక్కా గృహాల నిర్మాణం కోసం కొంతమంది అడుగుతున్నారని, పునాది వేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అద్దంకిని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చాలని, అద్దంకిలో ఎలక్ట్రిసిటీ డిఈ కార్యాలయం కావాలని 2012 నుండి అడుగుతున్నానని, కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో ఎలక్ట్రిసిటీ డిఈ కార్యాలయం వచ్చిందని, రెవెన్యూ డివిజన్ కేంద్రం మాత్రం రాకపోవటం వల్ల అప్పటినుండి పోరాడుతూనే ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు కషి కారణంగా అద్దంకి రెవెన్యూ డివిజన్ అయిందని సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల తరఫున చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాజముద్రతో 21 లక్షల మంది రైతులకు కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 17 వేల మందికి పాస్ పుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు. భర్త చనిపోతే ఆ భర్త పెన్షన్ వెంటనే భార్యకు ఇస్తున్నామని, ఇబ్బంది లేకుండా పెన్షన్లను ప్రజలకు అందిస్తున్నామని 2లో

రైతుల సంక్షేమమే ధ్యేయం

మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

5లో

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షునిగా

నేడు ఉగ్ర ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి-కనిగిరి

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షునిగా నియమితులైన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం శనివారం సాయంత్రం ఐదు గంటలకు ఒంగోలులోని ఎస్జీవిఎస్ కన్వెన్షన్‌లో జరగనుంది. డాక్టర్ ఉగ్రతో పాటు జిల్లా కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు కూడా హాజరుకానున్నారు. పార్టీ అధిష్ఠానానికి విధేయుడిగా ఉంటూ, రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, అందరినీ కలుపుకొని వెళ్లే నాయకుడిగా గుర్తింపు ఉండటంతో డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా అధిష్ఠానం ప్రత్యేక దష్టి సారించి నియమించింది. సామాజిక సమీకరణాల దష్ట్యా జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు కూడా ఆయనకే మద్దతు పలికారు. జిల్లాలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ అభిప్రాయ సేకరణ పూర్తి చేసి, ఒంగోలులో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశమై మద్దతు తెలపడం అనంతరం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కమిటీ చర్చలు జరపి నియామకానికి ఆమోదం తెలిపారు. అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం కల్పించాలనే ఉద్దేశంతో డాక్టర్ ఉగ్ర పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో శనివారం నాడు ఒంగోలులో ప్రమాణస్వీకారం జరగనుంది.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ విక్రమతేజ

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శింగరాయకొండ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బింగినపల్లి గ్రామంలో ఫైనాన్సియల్ లిటరసీ ప్రోగ్రామ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, వేలిముద్రల ద్వారా జరిగే మోసాలను నాటకంగా ప్రదర్శించి వివరించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ స్వర్ణ విక్రమతేజ, విశ్రాంత ఉద్యోగి కోటపాటి నారాయణ, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు.. తర్వాత అందరూ సమానమే..

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు.
అద్దంకి ఆర్డీవో లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలు రాజముద్రలతో ప్రింట్ చేసి ఇస్తున్నామని చెప్పారు. ఇందులో ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే అందులో మొత్తం వివరాలతో పాటు భూమి ఫోటో కూడా వస్తుందని అన్నారు. అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలో 24 వేల మందికి పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం తహాశీల్దారు సింగారావు, గ్రామ సర్పంచి మేడూరి అంజయ్య, ఎంపిడిఒ స్వరూపరాణి, తెలుగుదేశం మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, నాయకులు బాచిన సురేష్, పిచ్చిరెడ్డి, కుక్కపల్లి ఏడుకొండలు, ఓబులురెడ్డి, కెవి సుబ్బారావు, పాలపర్తి జకరయ్య, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

సఫాయి కర్మవారి వత్తిలో ఉన్న షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్కెఎఫ్ పథకం కింద సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను సబ్సిడీపై మంజూరు చేయనున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె అర్జున్ నాయక్ శుక్రవారం తెలిపారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఎస్‌సిలు గ్రూపుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అందలో ఒకరికి హెవీ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఒంగోలు ప్రగతి భవన్‌లోని జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తుల అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9849905970 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కొండపి

జీవన ఎరువులు(బయో ఫెర్టిలైజర్స్) వినియోగించడ వల్ల నేలలో సేంద్రీయ పోషకాలు పెరిగి,నేల సారవంతం అవుతుందనికృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని పెట్లూరు గ్రామంలో పిఎం-ఆర్ కెవివై పథకం ద్వారా రబీ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు,జీవన ఎరువుల వినియోగం, ఉపయోగాలపై రైతులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం వల్ల పెట్టుబడి పెరగడం, నేల భౌతిక, రసాయన లక్షణాలు దెబ్బతినడం, భూమి నిస్సారంగా మారడం లాంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ శైలజ, ఎఒ మాల్యాద్రి ఎఇఒ పి.కుమార్ విఎఎ కొండలరావు, మీరావలి, రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు తరలి వెళ్తున్న నాయకులు

బహిరంగసభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి-కందుకూరు

సిఐటియు ఆల్ ఇండియా మహాసభల సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సిఐటియు నాయకులు,కార్యకర్తలు శుక్రవారం తరలి వెళ్లారు. శింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి విశాఖపట్నం వెళ్లారు. విశాఖపట్నం బయలు దేరిన వారిలో సిఐటియు నాయకులు ఎస్ఎ.గౌస్,ఎస్కె.మున్వర్ సుల్తానా,ఎస్కె. మల్లీక,ఆస్మా తదితరులు ఉన్నారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వమించార. జిల్లా మలేరియా అధికారి ఎన్. మధుసూదనరావు పాణాంతక వ్యాధులైన డెంగీ, చికెన్ గున్యా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోని నీటి తొట్లు, డమ్ములపై మూతలు ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ డబ్బాలు, పాత టైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మన్నం శ్రీనివాసరావు, సెక్రటరీ స్వర్ణకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- వలేటివారిపాలెం

మండల పరిధిలోని శాఖవరం గ్రామంలో ఎంపీడీవో శంకరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తా, చెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో ఎక్కడ అపరి శుభ్రత వాతావరణం లేకుండా చూడాలన్నారు. రహదారులకు ఇరువైపుల ఉన్న పిచ్చిచెట్లు, చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. అనంతరం గ్రామంలో డోర్ టు డోర్ వాట్సాప్ గవర్నెన్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్య్యరమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి గోపాల్ టిడిపి నాయకులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ పోయినది

మార్కాపురం జిల్లా మార్కాపురం మండలం మార్కాపురం టౌన్, మున్సిపాలిటీ కాపరస్తులు ఏరువ సుబ్బారెడ్డి తండ్రి పెద్ద వెంకటరెడ్డి గత నెల 28.12. 2025వ తేదీన విజయవాడ నుండి హుబ్లీ ట్రైన్‌కి మధ్యాహ్నం 1.45 నిమిషాలకు విజయవాడ నుండి బయలుదేరి సాయంత్రం 5:30 నిమిషాలకు మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగారు. మార్కాపురం రైల్వేస్టేషన్ నుండి ఆటోలో మార్కాపురం పరిధిలోని కోర్టు సెంటర్ వద్దకు చేరుకొని ఆటో దిగి బ్యాగు తీసుకునేందుకు చూడగా నా బ్యాగు కనిపించలేదు. మార్గమధ్యంలో బ్యాగు పోయినది. గతం మూడు రోజుల నుండి చాలా చోట్ల బ్యాగు కోసం వెతికి, విచారించిన, దొరకలేదు. ఈ నలుపు రంగు ట్రావెలింగ్ బ్యాగ్‌లో రెండు జతల బట్టలు, రెండు వేల రూపాయల నగదు, ఆస్తి పత్రాలు ఉన్న బ్యాగు కనిపించలేదు. కావున నాయొక్క బ్యాగును ఎవరికైనా దొరికిన యెడల 9912690870 సెల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఏరువ సుబ్బారెడ్డి
సెల్ నెం. **9912690870**
ప్రస్తుత చిరునామా : మార్కాపురం పట్టణం, మార్కాపురం జిల్లా.
శాశ్వత చిరునామా : రాయవరం గ్రామం, మార్కాపురం మండలం, మార్కాపురం జిల్లా.

దావా సమన్లు

అండర్ ఆర్డర్ రూల్ 1 & 5 ఆఫ్ సి.పి.సి.
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం.123 / 2022

గుంటుపల్లి చెంచు రామయ్య ....వాది
వర్సెస్
తోలుసూరి రమేష్ ... ప్రతివాది
టు
ప్రతివాది :
తోలుసూరి రమేష్
తండ్రి నరసింహులు
ఎస్‌బిఐ బిల్డింగ్ యజమాని
పామూరు గ్రామం అండ్ మండలం,
మార్కాపురం జిల్లా.

పై నెంబరున వాది దావా పరిహారము కోరి మీ పైన దావా దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో తే: 09-01-2026 దిన పగలు 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ ద్వార గాని, పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్ పార్టీగా తీర్మానించబడునని తెలుసుకొనేది.

// By order of the court //
వాయిదా తేదీ : 09-01-2026
కనిగిరి
తేది: 02-01-2026 **అబ్దుల్ గఫార్ షేక్**
వాది తరపు న్యాయవాది
కనిగిరి, మార్కాపురం జిల్లా.

నోటీసు

అండర్ ఆర్డర్ 38 రూల్ 5 & సెక్షన్ 151 ఆఫ్ సి.పి.సి.
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.331/2022
ఓ.ఎస్.నెం.123/2022

గుంటుపల్లి చెంచు రామయ్య ...పిటిషనర్
వర్సెస్
తోలుసూరి రమేష్ ... రెస్పాండెంట్
రెస్పాండెంట్ :
తోలుసూరి రమేష్
తండ్రి నరసింహులు
ఎస్‌బిఐ బిల్డింగ్ యజమాని
పామూరు గ్రామం అండ్ మండలం,
మార్కాపురం జిల్లా

పై నెంబరున పిటిషనర్ అండర్ ఆర్డర్ 38 రూల్ 5 అండ్ సెక్షన్ 151 ఆఫ్ సి.పి.సి. పిటిషన్ దాఖలు చేసియున్నారు. గనుక మీకు ఆక్షేపణలున్నచో తే: 09-01-2026 దిన పగలు 10:30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడర్ ద్వార గాని, పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనేది. లేనిచో మిమ్ములను ఎక్స్‌పార్టీగా తీర్మానించబడునని తెలుసు కొనేది.

// By order of the court //
వాయిదా తేదీ : 09-01-2026
కనిగిరి
తేది: 02-01-2026 **అబ్దుల్ గఫార్ షేక్**
పిటీషనర్ తరపు న్యాయవాది
కనిగిరి, మార్కాపురం జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఇ.పి.నెం.130/2025
ఓ.యస్.నెం.708/2024

మధ్యలో :
బెల్లం శ్రీనివాసరావు ..డి.హెచ్.ఆర్
మరియు
నల్లూరి శ్రీనివాసులు ...జె.డి.ఆర్
టు :-
నల్లూరి శ్రీనివాసులు,
తండ్రి వెంకట సుబ్బయ్య, గవర్నమెంట్ టీచర్
నివాసం - డోరు నెం.6-228,
సుజాతనగర్, 7వ లైను,
ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా - 523002.

పై నంబరు ఇ.పి.లో జె.డి.ఆర్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా U/Order 21, Rule 48 నోటీసులు పంపినను, వాటిని తీసుకొననందున కోర్టువారు మీకు U/Order 21, Rule 48 నోటీసులు జారీచేయు నిమిత్తము తేది 19-01-2026న వాయిదా వేసి సదరు వాయిదాను ఈపేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా రోజున ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయముగా గానీ, లేదా న్యాయవాది ద్వారా గానీ, పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు. లేని యెడల కోర్టువారు మీకు పరోక్షముగా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 19-01-2026.

ఇట్లు
గుడిపూడి సురేంద్ర, B.Sc., LL.B.,
యం.ప్రమోద్,
జె.అనిల్ కుమార్
డి.హెచ్.ఆర్స్ తరఫున న్యాయవాదులు
ఒంగోలు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.A.No.110/2025
IN
E.P.No.10/2020
IN
O.S.No.11/1997

గూడా రాజసులోచన మరియు ఇతరులు
.... పిటీషనర్స్/డి.హెచ్.ఆర్
Vs
యలవర్తి సత్యవతీ మరియు ఇతరులు
.... రెస్పాడెంట్స్ జె.డి.ఆర్స్

ప్రకటన.

To:
14th Respondent
బాచిన రామారావు S/o వేంకటేశ్వర్లు
తిమ్మరాజుపాలెం గ్రామము, పర్చూరు మండలం,
బాపట్ల జిల్లా.

పై నంబరు అమలు పిటీషన్‌లో మిమ్మల్ని చనిపోయిన 7th రెస్పాడెంట్/ 7th జె.డి. ఆర్. వారుసుడు గా చేర్చమని దాఖలు చేసిన పై పిటీషన్ లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపు చున్నందువలన మీకు పై పిటీషన్‌లో నోటీసును ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ పిటీషన్ ను తేది. 29-01-2026 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30ని.లకు పైకోర్టువారి ఏదుట స్వయముగా గానీ వకీలు ద్వారాగానీ హాజరయి పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పైపిటీషన్‌ను మీపరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

వాయిదా తేది : 29-01-2026
// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
మారం శ్రీనివాసరావు,
తాడికొండ ప్రసాద్ బాబు.
వాది తరుపు న్యాయవాదులు

జిల్లా పంచాయతీ అధికారి
వారి కార్యాలయము
బాపట్ల

షార్టు టెండర్ నోటీసు

ROC.No 01/2026/B3, తేదీ:01-01-2026.

బాపట్ల జిల్లా లోని రేపల్లె,అమర్తలూరు, బాపట్ల, కర్లపాలెం,పిట్లవానిపాలెం, చెరుకుపల్లి, నగరం, మార్టూరు,వేటపాలెం మండలాలలో మండలం ఒక యూనిట్ గా "స్వచ్ఛ రథం నిర్వహణ కోసం అర్హులైన వ్యక్తులు/సంస్థలు/స్క్రాప్‌డీలర్లు/ఆపరేటర్ల నుండి ధరఖాస్తులు ఆహ్వానించడమైనది. ప్రతి మండలము ఒక యూనిట్ కనుక అభ్యర్ధులు విడివిడిగా ధరఖాస్తులు చేసుకోవాలి. మోడల్-1 క్రింద రూ.25,000/- ఎస్టిమేట్ రేటు నిర్ణయించటమైనది. ధరఖాస్తులు 07-01-2026 సాయంత్రం.5-00 గంటలలోపు సంభందిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయము నందు సమర్పించవలెను. 08-01-2026న టెండరు ఖరారు చేయుదురు.

అర్హతలు :
స్క్రాప్ డీలింగ్, ఘన వ్యర్ధాల సేకరణ లేదా పునర్వినియోగపరచదగిన పదార్ధాల నిర్వహణలో కనీసం(3)సంవత్సరాల ధృవీకరించబడిన అనుభవం కలిగి ఉండాలి.
స్క్రాప్ లేదా పునర్వినియోగ పరచదగిన పదార్ధాల డీలింగ్ కోసం చెల్లుబాటు అయ్యే ట్రేడ్ లైసెన్స్ / రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి.

ధరఖాస్తు దారుడు ధరఖాస్తు నకు ఈ క్రింద పేర్కొనిన వాటిని జతపరచాలి

ఆధార్ పాన్ కార్డ్ కాపీ,నివాసం లేదా సంస్థ రిజిస్ట్రేషన్ రుజువు, అనుభవ ధృవీకరపత్రం మరియు సహాయక పత్రాలు, స్క్రాప్ డీలింగ్ /MRF ఆపరేషన్ కోసం ట్రేడ్ లైసెన్స్,GST రిజిస్ట్రేషన్ (వర్తిస్తే),గత మూడు సంవత్సరాల టర్న్ ఓవర్ స్టేట్మెంట్ మరియు IT రిటర్న్‌లు, స్వచ్ఛ రథం కోసం ప్రతిపాదించబడిన వాహనం వివరములు (RC కాపీ,డ్రైవింగ్ లైసెన్స్,కాలుష్య ధృవీకరణ పత్రం, భీమా ధృవీకరణ పత్రం,ఫిటినెస్ సర్టిఫికేట్),బ్యాంక్ పాస్ బుక్, ఉమ్మడి ఆపరేషన్ వివరాలు వర్తిస్తే స్క్రాప్ డీలర్ అమరిక + వాహన యజమాని + ఆపరేటర్, అధికారుల నుండి నెలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ పొందటానికి బిడ్డర్ కోడ్ చేసిన మొత్తం సేవింగ్ (I-పరిమితి మోడల్ రూ.25,000),పాస్ పోర్టు సైజు ఫోటో గ్రాఫ్ మరియు సంప్రదింపు వివరాలు, ధరఖాస్తు దారుడు రూ.10,000/-డిమాండ్ డ్రాఫ్ట్‌కు MPDOచిరునామాతో ధరకాస్తుతో పాటు సమర్పించాలి, టెండర్ ఆమోదించుటకు గాని రద్దు పరుచటకు గాని మరియు వాయిదా వేయుటకు గాని జిల్లా పంచాయతీ అధికారి మరియు కన్వీనర్ వారికి పూర్తి అధికారము కలదు.

ఇతర వివరములకు జిల్లా పంచాయతీ అధికారి వారి కార్యాలయము వారిని (8712655891) సంప్రదించవలెను.

సం/- కె.ఎల్.ప్రభాకర్‌రావు
జిల్లా పంచాయతీ అధికారి మరియు కన్వీనర్
బాపట్ల



వాహన చోదకులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

వాహనాల తనిఖీ

ప్రజాశర్తి-టంగుటూరు

మండల పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడతూ వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : రహదారి భద్రతా కార్యక్రమంలో భాగంగా కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధలోని ఓగూరు వద్ద జాతీయ రహదారి 167పై కందుకూరు సిఐ అన్వర్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ వారికి రూ. 12,420 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సిఐ అన్వర్ బాషా, కందుకూరు రూరల్ ఎస్ఐ రాము, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుర్రా

బాధితులకు బుర్రా పరామర్శ

ప్రజాశక్తి-ఉలవపాడు

ఇటీవల ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలోని అలగాయపాలెం ఎస్‌సి కాలనీ చెందిన 12 మంది గాయపడ్డారు. వైద్య చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా వైసిపి కందుకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులన అడిగి తెలుసుకొని ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు నన్నం పోతురాజు, నాయకులు కోటు కోటిలింగం, వెలిచెర్ల ధనకోటి, గణేశం గంగిరెడ్డి, చీమల రాజా, అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, సయ్యద్ ఫజల్ , మద్దసాని నవీన్, పాలవల్లి అమర్నాథ్ రెడ్డి, సయ్యద్ దస్తగిరి సాహెబ్ చేజర్ల వెంకటరామిరెడ్డి, మానం సుబ్బారావు, తెడ్డు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రహదారి ప్రమాదాలను నిరోధించాలంటే భద్రతపై నిరంతర అవగాహన అవసరమని వక్తలు స్పష్టం చేశారు. ఒంగోలు ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. జనవరి 1 నుంచి 31 వరకూ ఈ మాస్సోతవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం (ఒఅండ్‌సి) ఎం. రవికాంత్, మోటార్ వాహన తనిఖీ అధికారులు యు. ధర్మేంద్ర, జయప్రకాశ్, ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు, డిపో మేనేజర్ జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు విధి నిర్వహణలో రహదారి నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. వేగ నియంత్రణ, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయాలని సూచించారు. వాహన చోదకులకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేటలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట బీసీ కాలనీలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పొట్టేళ్ల వ్యాపారం చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులు ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. వారిలో ఒకరు హత్యకు గురికావడం స్థానికంగా సంచలనం కలిగించింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. తాడివారిపల్లి గ్రామానికి చెందిన జయంపు కృష్ణయ్య(55), పట్టణానికి చెందిన కొమరోలు చిన్న రంగయ్య ఉమ్మడిగా పొట్టేళ్ల వ్యాపారం చేసుకుంటూ బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. చిన్నరంగయ్య కోసం వచ్చిన మిత్రుడు ఒకరు లోపల మంచంపై ముసుగు వేసిన శవం ఉండటాన్ని గమనించి రంగయ్య సోదరులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటి వద్దకు వచ్చి తలుపు తెరిచి చూడగా జయంపు కృష్ణయ్య దారుణ హత్యకు గురైన విషయాన్ని గుర్తించారు. కత్తితో భయంకరంగా దాడి చేశారు. ఘటన స్థలం రక్తమడుగులో ఉంది. విఆర్ఒ తురిమెళ్ల చెన్నమ్మ పోలీసులకు సమాచారం అందించారు. కంభం సిఐ మల్లికార్జునరావు, బేస్తవారిపేట ఎస్ఐ రవీంద్రారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. మార్కాపురం డిఎస్‌పి నాగరాజు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సహచరుడిగా ఉన్న చిన్నరంగయ్య ఆచూకీ లేకపోవడంతో పరారీలో ఉన్నట్లు భావిస్తున్నారు. వ్యాపార లావాదేవీల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండవచ్చని సన్నిహితులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మంచుతో ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు ప్రాంతంలో శుక్రవారం ఉదయం దట్టమైన పొగ మంచు పట్టింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తెల్లవారుజాము నుంచే మంచు పట్టడంతో రహదారులు మంచుతో కప్పి కనపడలేద. వాహనదారులు ఇబ్బందులక గురయ్యారు. మంచు కారణంగా రహదారి సరిగా కనిపించక పోవడంతో శింగరాయకొండ–బద్వేల్ జాతీయ రహదారిపై వాహనాలు నిదానంగా రాకపోకల సాగించాయి. వివిధ పనుల నిమిత్తం బయటకు వచ్చిన మంచులో తడిసి పొయారు. ఉదయం 7 గంటల వరకు వాహనాల వరకూ వాహన చోదకులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు.



మంచుకారణంగా కనిపించని రహదారి

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రకాశం జిల్లా నుంచి పలువురు సాహితీవేత్తలకు ఆహ్వానాల అందాయి. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ మహాసభలు మూడు రోజులపాటు నాలుగు వేదికలపై వైభవంగా జరగనన్నాయి. దేశ విదేశాల నుంచి సుమారు 2,000 మంది ప్రతినిధులు, వక్తలు పాల్గొననున్నారు.జిల్లా నుంచి అవధాని మానేపల్లి నాగకుమార శర్మ, రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తదితరులు ఆహ్వానం అందింది.



నిత్యావసరాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు

కుల, మతాలకతీతంగా గత ఐదు ఏళ్ళుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐఎఫ్‌సి ఫౌడేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరుకులు,బియం శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాద్యతగా తమకు తోచినంత సాయం అందించే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సాజిద్,ట్రజరర్ హఫీజ్, పట్టణ ఇన్‌చార్జి అయూబ్ ఖాన్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

4న లూయిస్ బ్రెయిలీ జయంతి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

లూయిస్ బ్రెయిలీ జయంతి ఈనెల 4న నిర్వహించ నున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సిహెచ్. సువార్త శుక్రవారం తెలిపారు. ఒంగోలు పట్టణంలోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దష్టిలోపం (విజువల్లీ హ్యాండీక్యాప్డ్) ఉన్న వ్యక్తులు, సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జెర్సీని ఆవిష్కరించిన మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో బిఆర్.ఆంబేద్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 3 నుంచి నిర్వహంచనున్నారు. అందులో భాగంగా టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు సంబంధించిన జెర్సీలను మంత్రి స్వామి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మన్నం శ్రీనివాసులు, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎడవల్లిలో ఘర్షణ నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వ్యక్తిగత సమస్య కులాల సమస్యగా మారి తీవ్ర ఉధృతం అయ్యింది. ఈ ఘటన మండలంలోని ఎడవల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యడవల్లి గ్రామంలో రజక సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వడ్డెర కులానికి చెందిన బత్తుల ఏడుకొండలుపై గురువారం సాయంత్రం దాడి చేశారు. వడ్డెర సామాజికవర్గానికి చెందినవారు ఏడుకొండలును ఎందుక కొట్టారని రజక సామాజిక వర్గానికి చెందినవారిని అడగడంతో గొడవ పెద్దదైంది. ఇరువు వర్గాల వారు దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో రజక వర్గానికి చెందిన అవుకు నడిపి పోలయ్య, శంకర్, ఎల్లయ్య, సంఘవికి గాయాలయ్యాయి. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. మార్కాపురం సిఐ సుబ్బారావు, వెంకటరమణ, పెద్దారవీడు ఎస్ఐ సాంబశివయ్య మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమ్మరావు ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.



ఎక్స్‌రేలు తీస్తున్న వైద్య బృందం

'టిబి ముక్త భారత్'లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

సమాజంలో విస్తరిస్తున్న టిబి మహమ్మారిని పారద్రోలేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టిబి ముక్త భారత్ అభియాన్‌కు ప్రతి ఒక్కరూ సహరించాలని, భాగస్వాములు కావాలని వైద్య ఆరోగ్య అధికారులు డాక్టర్ ధీరేంద్రకుమార్, డాక్టర్ వంశీధర్ తెలిపారు. శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఎఐ బేస్డ్ ఎక్సర్ (ఛస్ట్ ఎక్సర్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంశీధర్ మాట్లాడుతూ టిబి ముక్త భారత్ అభియాన్‌లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బాధ్యతను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చి ప్రజలను టిబి బారి నుంచి కాపాడేందుకు వైద్య ఆరోగ్య శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో కాలుష్యం, ఇతర కారణాల చేత ప్రజలు టిబి, ఇతర వ్యాధులకు గురి కాకుండా వారిలో టిబి తీవ్రతను అంచనా వేసి వారికి తగిన చికిత్స అందించే దిశగా వైద్య ఆరోగ్య శాఖ గ్రామీణ ఆరోగ్య మందిరాల వద్దకే ఎఐ బేస్డ్ ఎక్సర్ ప్లాంట్‌ను తీసుకువచ్చి ఎక్కడికక్కడే వ్యాధి నిర్ధారణ, తీవ్రత గుర్తించి చికిత్సఅందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ధీరేంద్రకుమార్, సూపర్‌వైజర్ కల్యాణి, ఎఎస్‌టిఎస్ షేక్ అబ్దుల్, నిస్సార్, ఎస్‌టిఎల్ ఎస్‌కె.కిరణ్‌కుమార్, టెక్నీషియన్ కాలేషా, 104 సిబ్బంది అడకా శ్రీకాంత్, ఎఎన్‌ఎం రమణమ్మ, ఆరోగ్య మందిర్ ఆరోగ్య సిబ్బంది, సాయితేజ, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 4న ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో గుంటూరు పెదకాకాని ఆసుపత్రి, శంకర నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అవసరమైన వారికి గుంటూరు పెదకాకాని ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈ వెద్య శిబిరాన్ని సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని బొర్రావారిపాలెం పంచాయితీలో రూ.40 లక్షల జిరాంజీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డుకు మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో మంచినీటి పథకానికి, రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తమ ప్రభుత్వం ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. గత పాలకులు గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామస్తులు పూలు చల్లుతూ అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అనగానే శివప్రసాద్, ఆర్డీఓ రామలక్ష్మి, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఓ ఎన్ నాగలక్ష్మి, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, సర్పంచ్ కేసన నాగ ముత్యాలమ్మ, ఎంపీటీసీ బుడారంకమ్మ, మాజీ సర్పంచ్ కేసన్న సోమయ్య, తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, ఎల్లయ్య పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు కృషి

ప్రజాశక్తి - నిజాంపట్నం

సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు పునరంకితం కావాలనీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని బొర్రావారిపాలెంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి 1831 జనవరి 3న జన్మించి తన 12వ ఏట మహాత్మా జ్యోతిబా పూలేతో వివాహమయ్యారని గుర్తు చేశారు. 1848లో దేశంలోనే తొలి బాలికల పాఠశాల ప్రారంభించి, తొలి ఉపాధ్యాయినిగా పని చేశారని చెప్పారు. ఆమె భర్త జ్యోతిబా పూలే సహకారంతో 52 పాఠశాలలు ఏర్పాటు చేసి, మహిళలు, అణగారిన వర్గాల విద్యావ్యాప్తికి కృషి చేశారని అన్నారు.బాల్య వివాహాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా పోరాడి, అనాధ, వితంతు పిల్లలకు సంరక్షణ అందించారని చెప్పారు.



సావిత్రిబాయికి నివాళి అర్పిస్తున్న మంత్రి సత్యప్రసాద్

రైతుల భూమి హక్కులకు భరోసా



పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

సిఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశంలో మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టిందని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. పట్టణంలోని ఉజిలీపేటలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ ఫోటోతో జారీ చేసిన పాసుపుస్తకాల్లో ఉన్న తప్పిదాలు సవరించి ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్‌లతో రూపొందించిన నూతన పాసుపుస్తకాలను రైతులు, భూయజమానులకు అందజేశారు. తమ ప్రభుత్వం అధికారానికి వచ్చిన అనంతరం రెవెన్యూ శాఖ రీ సర్వే నిర్వహించి, వెబ్ ల్యాండ్‌లోని వివరాలతో అనుసంధానం చేస్తూ 21.86 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. జగన్ బొమ్మ స్థానంలో ప్రభుత్వ రాజముద్ర పొందుపర్చడం ద్వారా పాసుపుస్తకాలకు చట్టబద్ధత వచ్చిందని, మరింత పారదర్శకత పెరిగిందని తెలిపారు. ప్రజలకు భారంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నుంచి విముక్తి కల్పించి, రైతుల హక్కులు సిఎం చంద్రబాబు నాయుడు కాపాడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు, తహశీల్దారు గోపీకృష్ణ, ఎంసి చైర్మన్ కౌతరపు జనార్దన్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల కేంద్రమైన యద్దనపూడి సచివాలయంలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఓలేరు రేణుక, బాలకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో పట్టాదారు పాస్‌పుస్తకాలపై జగన్ ఫోటో పెట్టుకుని ఇవ్వడం వలన బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేకపోయారని అన్నారు. తాతలు, తండ్రుల నుండి వారసత్వంగా వచ్చిన ఆస్తి హక్కు పత్రాలపై తమ ఫోటోలు కాకుండా జగన్‌ఫోటోలు ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. తహశీల్దారు కె రవి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన మాట నిలబెట్టుకుని రైతులకు పాటాదారు పాస్ పుస్తకాలు ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను,టిడిపి బాపట్ల పార్లమెంట్ కార్యదర్శి ఆర్ సీతయ్య, టిడిపి మండల అధ్యక్షులు రంగయ్య చౌదరి, నాగేశ్వరరావు, జాగర్లమూడి సుబ్బారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, రాజు, వెంకటరావు పాల్గొన్నారు.



యద్దనపూడిలో పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సిఐటియు జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - పంగులూరు



జండాన్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలకు కార్యకర్తలు తరలి వెళ్ళన్న సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్ సెంటర్లో సిఐటియు జెండాను సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు నాగబోయిన రంగారావు మాట్లాడుతూ సిఐటియు జెండా కార్మికుల పక్షాన పోరాడుతుందని అన్నారు. ఎంత పెద్ద వ్యాక్తైనా కార్మికుల పోరాటాలకు దిగిరాక తప్పదని అన్నారు. గత మూడు రోజులుగా జొమాటో, అమెజాన్ వంటి కంపెనీలు కార్మికుల పోరాటాలకు దిగివచ్చి కార్మికుల తీర్చాయని అన్నారు. ఎన్నో రకాల కార్మిక రంగాలకు సిఐటియు అండగా ఉంటుందని చెప్పారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ, ఆదిమ్ సాహెబ్, వెంకట్రావు, తానికొండ సుధాకర్, పూసపాటి సుబ్బరాజు, ఆశాలు సువార్త, నాగమణి, అనురాధ, శాంతి, తేజ, కనికరమ్మ, రమాదేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.



వ్య.కా.స క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నూతన క్యాలెండర్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, వ్యవసాయ రైతుల పక్షాన ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎనలేని కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు, సాధినేని మస్తానారావు, కొరిసపాడు మండల టిడిపి అధ్యక్షులు సింబోతుల సత్యనారాయణ, కాలుసాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



స్థలం పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ లైన్ ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి - నిజాంపట్నం

మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ నేత అనగాని శివప్రసాద్ చొరవతో జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, డబ్ల్యూఎల్ఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహకారంతో పంచాయతీలోని ముండ్రేడు గ్రామంలో తాగునీటి సంపు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో నిజాంపట్నం నుంచి ముండ్రేడు గ్రామం వరకు నూతన పైపు లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. తాగునీటి సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా చింతరేవు రోడ్డు నుంచి ముట్లచెరువు వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయనున్నారు. చెరుకుపల్లి విద్యుత్ డీఈఈ సురేష్ బాబు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు అవసరమైన పనుల నిర్వహణపై జడ్పీటీసీ నర్రా సుబ్బయ్యతో చర్చించారు. తాగునీటి సంపు పూర్తయితే ముండ్రేడు గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

ఆరోగ్య సమస్యలతో బాధపడే అనేకమందికి సిఎం సహాయనిధి అండగా నిలుస్తుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరంలోని టిడిపి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 147 మంది లబ్ధిదారులకు రూ.1.40 కోట్లకుపైగా సిఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, బొరెడ్డి ఓబులురెడ్డి, గరిమిడి జగన్మోహనరావు, గుడిబండ్ల ఆదిరెడ్డి, కాటా అంజయ్య, గుర్రం ఆదిశేకర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యప్రసాద్

రేపల్లె : నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతుందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ఆర్థిక స్తోమత లేని వారికి కార్పొరేట్ వైద్యం అందించడంలో ఈ నిధి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 66 మంది లబ్ధిదారులకు రూ.71,06,035 విలువైన చెక్కులు శుక్రవారం పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా అర్హత ఆధారంగానే నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.15కోట్లకు పైగా సీఎం సహాయ నిధి నుండి నిరుపేదలకు అందజేసినట్లు తెలిపారు.

రసాయన ఎరువులు తగ్గించాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని ముండ్లమూరు రైతు సేవా కేంద్రంలో ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు 2 రోజుల శిక్షణ నిర్వహించారు. డిఆర్‌సి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ రామ్మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, దాని ఆవశ్యకత గురించి వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతులు అలవర్చుకోవడం వలన భూమిలోని సేంద్రీయ కర్బన శాతాన్ని పెంచి నేలను ఆరోగ్యవంతంగా చేయొచ్చని తెలిపారు. ఏపీసీఎన్ఎఫ్ నోడల్ ఆఫీసర్ షేక్ కరీముల్లా రైతులకు ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన రాజీలేని 9 సూత్రాలను క్లుప్తంగా వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సహజ సిద్ధమైన ప్రకృతి వనరులతో తయారు చేసుకున్న జీవామృత ఎరువుల వాడకం వల్ల భూమి ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. పంటలకు అవసరమైన పోషకాలు అందించే మిత్ర బ్యాక్టీరియా ఉంటుందని చెప్పారు. ఆరోగ్య వంతమైన దిగుబడులు తక్కువ పెట్టుబడితో వస్తాయని చెప్పారు. దర్శి ఎడిఎ కె బాలాజీ నాయక్ మాట్లాడుతూ రైతులు రబీ పంట కాలంలో వేసిన ప్రతి పంట ఈ క్రాప్ పంట నమోదు చేయించు కోవాలని అన్నారు. పంట నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోతే పరిహారం పొందవచ్చని అన్నారు. దిగుబడిన వచ్చిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలోఅ అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఓ తిరుమలరావు, వివిఎ వీరాంజనేయులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎఫ్ఎంటిలు కోటయ్య, మురళి, యోగేశ్వరమ్మ, సుబ్బారావు వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-పొన్నలూరు

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రైతులకు రాజు ముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకంపై ఉన్న క్యూఆర్ కోడ్లు స్కాన్ చేస్తే పొలం వివరాలు, రైతు ఫోటో తెలుపుతుందని తెలిపారు. గత ప్రభుత్వం తమ ఫోటోలతో పాస్‌పుస్తకాలు, పొలాల్లో సర్వే రాళ్లుఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరికి భూమి ఉందో వారికి హక్కు కలిగే విధానం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సంక్షేమ పథకాలు కుల, మతాలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రాజముద్ర వేసి పాసుపుస్తకాలు పంపిణీ చేస్తుందన్నారు. పుస్తకాలు రైతులు హక్కుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ హిమవంశి, తహశీల్దారు పుల్లారావు, ఎంపిడిఒ డాక్టర్ పి.సుజాత, ఎఎంసి చైర్మన్ కర్ర తిరుపతమ్మ, మాజీ ఎంపిపి కొండ్రగుంట శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, నాయకులు కర్ర కోటిరెడ్డి, మన్నం రమణయ్య, మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, మండవ మురళీమోహన్, మన్నెం మల్లికార్జునరావు, రమణారెడ్డి, రాఘవరెడ్డి, పిల్లి వెంకట్ నారాయణరెడ్డి, పసల రమణయ్య, జనసేన సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.


పాసుపుస్తకాలు అందజేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ రాజాబాబు

చీమకుర్తి : చీమకుర్తి మండలం గాడిపర్తి వారిపాలెం పంచాయతీ పరిధిలోని రంగసాయ పురంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఆర్. బ్రహ్మయ్య, మద్దిపాడు ఎఎంసి చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాదు, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షుడు గొట్టిపాటి రాఘవరావు,మండల ప్రధాన కార్యదర్శి ఇస్తర్ల ఏడుకొండలు, టిడిపి నాయకులు రంపతోటి అంకారావు, టిడిపి గ్రామఅధ్యక్షుడు జ్యోతి వేణు, నాయకులు గమిని ప్రసాదు, గమిని కృష్ణారావు,గమిని ఆంజనేయులు, సర్పంచి ఆదిబాబు, అంజయ్య, నారిపెద్ది అంజమ్మ, మండలపు రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉలవపాడు : గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అనుభవం లేని నిర్ణయాలు తీసుకున్నందువల్లే రాష్ట్రవ్యాప్తంగా రైతులు భూ సమస్యలు ఎదుర్కొంటున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ తప్పులన్నీ ఒక్కొక్కటిగా సరిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ముద్రించిన పాసు పుస్తకాలను మండల పరిధిలోని చాగొల్లు గ్రామంలో శుక్రవారం పంపిణీ చేశారు. 660 మంది రైతులకు పాసు పుస్తకాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు పనితీరుపై మండిపడ్డారు. కార్యాలయాలకు వచ్చాం, సాయంత్రానికి వెళ్లాం అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. విఆర్‌ఒలు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఒ బి.సురేష్, డిప్యూటీ తహశీల్దారు పద్మావతి, ఎఒ డి.విజయకుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రాచగర్ల సుబ్బారావు, తమ్మినేని శ్రీనివాసులు, వర్దినేని శ్రీనివాసులు, రావిపాటి మహేష్, వల్లూరి వెంకట రమణయ్య, కడియాల సుబ్బారావు, కారసాల శ్రీనివాసులు, తమ్మినేని నరసింహ నాయుడు,కంచర్ల వెంకటేశ్వర్లు, మందాడి రాములు గుంజి వెంకయ్య, గుంజి సుబ్బారావు, పోలుబోయిన శ్రీనివాసులు, అమ్మనబ్రోలు రమేష్, మాధవ, ఓగుబోయిన యానాది, వెంకట రామరాజు, ఎందేటి శ్రీను, వాయల శ్రీనివాసులు, వెంకట చలపతి రైతులు పాల్గొన్నారు.

కొండపి : రైతులకు రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు అందజేసినట్లు తహశీల్దారు శీలం శ్రీనివాసరావు తెలిపారు. మండలపరిధిలోని పెట్లూరు, పికె.కండ్రిక, పియం. కండ్రికలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. పెట్లూరులో గ్రామ సర్పంచి ఆరెతోటి ఝాన్సీరాణి చేతుల మీదుగా పాసుపస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామాంజనేయులు, డిప్యూటీ తహశీల్దారు, ఆర్ఐ , సర్వేయర్ రాజు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

జరుగుమల్లి : మండల పరిధిలోని తూమాడు గ్రామంలో రైతులకు నూతన పాసుపుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు మురళి మాట్లాడుతూ నూతన పట్టాదారు పాసు పుస్తకాల మీద క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ భూములు, పొలాల్లో హద్దులు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈనెల 2 నుంచి 9 వరకూ ప్రతిరోజూ ఓ గ్రామంలో పాసుపుస్తకాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథ్, సర్వేయర్ విష్ణు, ఆర్ఐ. ప్రసూన, విఆర్‌ఒలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగసముద్రం : మండల పరిధిలోని అన్నేబోయిన పల్లి గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను తహశీల్దారు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎం.హనుమాయమ్మ, ఎఒ దుర్గ, ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు, ఆర్ఐ ఎం. రమణయ్య, వీఆర్వోలు, టిడిపి నాయకులు వంకాయలపాటి మాల్యాద్రి, సోంపల్లి మనోహర్, ఎందోటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.


చీమకుర్తిలో పాస్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్


ఉలవపాడులో పాస్‌పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి


సహాయనిధి చెక్కులు అందజేస్తున్న మంత్రి స్వామి

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్దిదారులకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి శుక్రవారం అందజేశారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు సహాయనిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని తెలిపారు. పేదల విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొణిజేడు గ్రామ తెలుగు యువత అధ్యక్షుడు రామా గోపి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాక్‌లు అందజేస్తున్న దాత బైరపునేని మోహన్‌రావు

ఇసుప రాక్‌లు బహూకరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు దాతలు మూడు ఐరన్ రాక్‌లు బహూకరించారు. పాఠశాలలో అసైన్మెంట్ బుక్ లెట్స్‌ని మరియు ఇతర పుస్తకాలను సర్దుబాటు చేసుకోవడానికి ఉపాధ్యాయులకు వీలుగా ఉండటం కోసం దాతలు కనుమళ్ల సొసైటీ అధ్యక్షుడు బైరపునేని మోహన్‌రావు ఓ రాక్‌ను, కీర్తి శేషులు, ఉపాధ్యాయులు బెల్లం వీరనారాయణ జ్ఞాపకార్థం వారి సతీమణి, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు పసుపులేటి కోటేశ్వరి రెండు రాక్‌లను పాఠశాలకు బహుకరించారు. పాఠశాలకు ఎంతో అవసరమైన రాక్‌లు బహూకరించినందుకు దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలినేని గోపీచంద్, మాజీ ఎంపీటీసీ పారా రామకోటయ్య, షేక్ యాసిన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ల రీడర్లు

విద్యుత్ మీటర్ల రీడర్లు నిరసన

ప్రజాశక్తి-కొండపి

విద్యుత్ మీటర్ రీడర్స్ యొక్క ఉద్యోగ భద్రత మరియు నెల వారి వేతనాలు అమలు చేయాలని ఎపి విద్యుత్ మీటర్ జిల్లా అధ్యక్షుడు కె.సిద్ధయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ రీడర్లు నల్లబ్యాడ్జీ కట్టుకొని నిరసన తెలుపుతూ శుక్రవారం ఇంటింటికి వెళ్లి విద్యుత్ రీడింగ్ తీశారు. ఈ సందర్భంగా కె.సిద్దయ్య మాట్లాడుతూ విద్యుత్ సంస్థనే నమ్ముకొని సుమారు 10 నుంచి 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్స్‌కు స్మార్ట్ మీటర్స్ బిగిస్తున్న తరుణంలో వేతనాలు తగ్గుతున్నట్లు తెలిపారు. వారికి ఉపాధి కోల్పోయి రోడ్డున పడకుండా విద్యుత్ సంస్థలోని ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. విద్యుత్ మీటర్ల రీడర్స్ సమస్యలు పరిష్కారానికి ఈనెల 19,20,21 తేదీల్లో సిఎమ్‌డి కార్యాలయం వద్ద నిరసన, జనవరి 22 ఛలో సిఎమ్‌డి కార్యాలయం, జనవరి 27న 23 జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రం ఇవ్వాలని పిలుపు నిచ్చారన్నారు. జనవరి 29,30,31 మరియు ఫిబ్రవరి 1న విజయవాడ రిలే దీక్షలు, ఫిబ్రవరి 2 ఛలో విజయవాడ నిర్వహించనున్నట్లు తెలిపారు.

జిల్లా ఎస్‌పిని కలిసిన ఒంగోలు ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్‌పి ఛాంబర్‌లో ఆయన్ని శుక్రవారం ఎమ్మెల్యే దామచర్ల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పిని సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే జనార్ధన్‌ను కలిసిన ఉపాస్ డైరెక్టర్ల బృందం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావును ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ జి. ఉమాపతి చౌదరి, డాక్టర్ ప్రకాష్ చవల, డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్ పోకూరి ఎమ్మెల్యేకు బొకే మిఠాయిలు అందించారు.


దామచర్లకు శుభాకాంక్షలు చెబుతున్న ఉపాస్ డైరెక్టర్లు


చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి సురేష్

చిన్నారిని ఆశీర్వదించిన మాజీ మంత్రి సురేష్

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండల పరిధిలోని ఎడ్లూరుపాడు గ్రామంలో గ్రామ సర్పంచి రావి శ్రీను మనుమడు చిన్నారి అద్విక్ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసిపి పిఎసి సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని చిన్నారి అద్విక్‌ను ఆశీర్వదించారు. అద్విక్‌ను ఆశీర్వదించిన వారిలో వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబరు, పిడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు రాక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి ప్రజలు, విద్యార్థులు ఆర్టిసి బస్సు లేక ప్రయాణానికి నానా ఇబ్బందులు పడ్డారు. గ్రామానికి చెందిన విద్యార్థులు అనంతవరం ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్నారు. గ్రామానికి బస్సు రాకపోవడంతో సూరవరపు పల్లి నుండి అనంతవరం వరకు నడచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సూరవరపుపల్లి ఎస్సి కాలనీ వాసులు మాట్లాడుతూ పెదనందిపాడు మండలం ఉప్పలపాడులో తమ బంధువు చనిపోవడంతో అక్కడికి వెళ్ళడానికి బస్సు లేక ఇబ్బంది పడాల్సి వచ్చిందని ఆవేదనగా తెలిపారు. ద్విచక్ర వాహనాలు ఉన్నవారు



పాఠశాలకు నడిచి వెళుతున్న విద్యార్థులు

వాటిపై వెళ్ళగా మిగిలిన వారు జాతీయ రహదారి వరకు నడచి వెళ్ళి తరువాత ఇతర బస్సులు ఎక్కి వెళ్ళామని అన్నారు. అనంతవరం పంచాయతీ పరిధిలో పైపు లైన్ మరమత్తు పనుల కారణంగా తమ గ్రామం వైపు బస్సులు రాకుండా గుదేవారిపాలెం వైపు మళ్లించడంతో తాము ఇబ్బంది పడాల్సి వచ్చిందని అన్నారు. ముందే తెలిసి ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే వారమని తెలిపారు. ఈ విసయమై అనంతవరం పంచాయతీ కార్యదర్శి దోప్పలపూడి మోహన్ బాబును వివరణ కోరగా అనంతవరం చిన్న ఓవర్ హెడ్ ట్యాంకు సమీపంలో పైపు మరమ్మత్తుకు గురవడంతో పనులు చేపట్టి శుక్రవారమే పూర్తి చేశామని తెలిపారు. శనివారం నుండి చిలకలూరిపేట డిపో బస్సు యాదావీధిగా తిరుగుతుందని చెప్పారు.

'తాతల నాటి ఆస్తులపై జగన్ బొమ్మలేంటి?'

ప్రజాశక్తి - బల్లికురవ

తాత, ముత్తాతలు తమ వారసులకు ఇచ్చిన అనువంశిక ఆస్తుల మీద మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి తన హయాంలో తన బొమ్మలు ముద్రించుకొని రైతులకు పాస్ పుస్తకాలు అందజేయటం విడ్డూరంగా ఉందని టిడిపి బల్లికురవ క్లస్టర్ ఇంచార్జ్ మల్లీనీడి గోవిందరావు అన్నారు. మండలంలోని వల్లాపల్లిలో పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూముల హక్కుదారుల పాసు పుస్తకాలపై వారి బొమ్మలు తొలగించి తన బొమ్మ ముద్రించుకొని అన్నదాతల భూములను తాకట్టు పెట్టేందుకు రీ సర్వే పేరుతో పావులు కదిపారని అన్నారు. భూముల హక్కుదారులు, ప్రభుత్వ రాజముద్రలకు తావు లేకుండా తన బొమ్మ వేసుకుని తుగ్లక్ పాలనను గుర్తుకు తెచ్చారని అన్నారు.



పాస్‌పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

జగన్మోహనరెడ్డి బొమ్మల పుస్తకాలతో రైతులు బ్యాంకు రుణాలు కూడా పొందలేక పోయారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి, రైతులంతా సుభిక్షంగా ఉండాలని, అన్నదాతల భావితరాల వారసులకు భూ సమస్యలకు తావు లేకుండా సిఎం చంద్రబాబు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శాశ్వత పరిష్కారం చూపారన్నారు. హక్కుదారుల ఫోటోలతో, రాజ ముద్రలతో పాసుపుస్తకాలు అందించటం హర్షనీయమని అన్నారు. తహశీల్దారు రవి నాయక్ మాట్లాడుతూ మండలంలో రీ సర్వే పారదర్శకంగా కొనసాగుతుందని అన్నారు. సర్వే పూర్తయిన గ్రామల్లో కొత్త పాసుపుస్తకాలు రాజముద్ర, హక్కుదారుల చిత్రాలతో అందిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే జరిగే గ్రామాల్లో రైతులు సకాలంలో అందుబాటులో ఉంటూ అధికారులకు తమ వంతు సహకారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ప్రహర్ష, టిడిపి నేతలు రామారావు, విఆర్ఒ శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ యోగాసన పోటీల్లో తృతీయ బహుమతి

ప్రజాశక్తి - పంగులూరు

గత డిసెంబర్ 29 నుండి ఈనెల 2న శుక్రవారం వరకు మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో మండలంలోని చందలూరు జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని నాయపాము శృతి తృతీయ బహుమతు సాధించింది. ఆమె ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్‌కు ఎంపికయ్యారు. 8వ తరగతి



నాయపాము శృతి

చదువుతున్న శృతి ఇటీవల భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాసన భారత్‌లో భాగంగా 6వ సబ్ జూనియర్, సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ 2025-26 సంవత్సరానికి జరిగిన పోటీలో తృతీయ స్థానం సాధించింది. 6వ తరగతి నుండి కఠోర సాధన చేసి ఈ స్థాయికి చేరిందని పీడీ ప్రతిమ తెలిపారు. పేదరికంలో పుట్టి, కుటుంబ నేపధ్యం సహకరించకున్నా గ్రామ ప్రజలు, దాతల ప్రోత్సాహంతో అంచలంచెలుగా ఎదిగిందని తెలిపారు. మంత్రి గొట్టిపాటి అభినందనలు జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన విద్యార్థిని నాయపాము శృతికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అభినందనలు తెలిపారు. శృతికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన పీడీలు ప్రతిమ, మధుమూర్తులను అభినందించారు. శృతి, పీడీలను హెచ్ఎం చందలూరు గిరిజ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

ఆర్టీసీ బస్టాండులో ప్రమాదం

ప్రజాశక్తి - చీరాల

బస్సు ఢీకొని కారంచేడు మండలం జరుబులవారిపాలెంకు చెందిన బొనిగల ఆదిలక్ష్మి (62)గా మృతిచెందింది. జరు బులవారిపాలెం నుంచి చీరాల జయంతిపేటలో నివసిస్తున్న కుటుంబ సభ్యులను కలిసేందుకు వచ్చిన సమయంలోనే ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న 1వ పట్టణ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో బస్టాండ్ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. బస్టాండులో ప్రయాణికులు అందరూ చూస్తుండగా ఈ ఘటన చోటు చేసుకోవటంతో భయందోళన చెందారు.

కెరీర్ గైడెన్స్‌లో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - చుండూరు

బాపట్లలో పాఠశాల విద్యా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కెరీర్ ఎగ్జిబిషన్‌లో మండలంలోని ఎడ్లపల్లి పిఎంపి శ్రీ ఆలపాటి వెంకటరామయ్య జెడ్పి ఉన్నత పాఠశాల ప్లస్ నందు 8, 9వ తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కామినేని హేమ వర్థిని, జనని తయారు చేసిన కెరియర్ ఆర్చ్ ద్వితీయ స్థానం లభించింది. అందుబాటులో ఉన్న వివిధ వృత్తులను తెలియజేస్తూ రూపొందించిన చార్ట్ ప్రిపరేషన్ విభాగంలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం పొందారు. తమ పాఠశాల్లోని ఒకేషనల్ ట్రైనర్ పి జాన్ వెస్లీ, తిరుపతిరావు, త్రివేణి శిక్షణ ఇచ్చారు. ద్వితీయ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

స్థానం సాధించిన విద్యార్థులను ఎస్ఎంసి చైర్మన్ భయ్యా ప్రదీప్, అలపర్తి శ్రీనివాసరావు, హెచ్ఎం కుర్ర శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎన్ ప్రసాద్ బాబు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఎఓ వివి.శేషమ్మ

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

ప్రజాశక్తి-తాళ్ళూరు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో ప్రయోజనమని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం ఎఓ వి వెంకట శేషమ్మ తెలిపారు. తూర్పుగంగవరంలో పిఎంఆర్ కెవివై రబీ క్రింద ప్రకతి వ్యవ సాయం సాగుపై 30 మంది రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించా రు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఎఓ వి వెంకట శేషమ్మ మాట్లాడతూ ప్రకతి వ్యవసాయంపై ప్రశ్నాపత్రం, నేలఆరోగ్యం, భూసారం పెంపుదల, ఘన ద్రవ జీవామతృల వల్ల ఉపయోగం గురించి వివరిం చారు. మండల వ్యవసాయాధికారి బి ప్రసాదరావు మాట్లా డుతూ ప్రకతి వ్యవసాయంపై శిక్షణ నిర్వహించుటకు గల ప్రాముఖ్యత, ఆవశ్యకత, రైతులు సాగు చేసిన పంటల వివరాలు గురించి వివరించారు. ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ వి నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట విత్తక ముందు నుంచి కోత వరకూ నిర్వహించవలసిన సాగుపద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రకతి వ్యవసాయం గురించి ముద్రించిన కరదీపికలను రైతులకు అందజేశారు. విఎ ఎడి.సుప్రజ పాల్గొన్నారు.

నేడు నల్లమడ రైతుల సమావేశం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక కొల్లా వారి కళ్యాణ మండపంలో ఈనెల 3న శనివారం ఉదయం నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టరు కోల్లా రాజమోహనరావు శుక్రవారం తెలిపారు. సమావేశానికి నల్లమడ ప్రాంత రైతులు పాల్గొనాలని కోరారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు గురించి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆటో అందజేస్తున్న ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్

చెత్త సేకరణ ఆటో ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని దేవరపల్లి పంచాయతీలో చెత్త సేకరించేందుకు నూతనంగా మంజూరైన ఈ ఆటోను ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్ శుక్రవారం ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పంచాయతీలకు ఈ ఆటోలను అందజేస్తున్నట్లుతెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా రూ.3.5 లక్షలతో మంజూరైన ఈ ఆటోను పంపిణీ చేశారు. ఆటో తాళాలను ఎంపీటీసీకి అందజేశారు. గృహ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడిచేత్త, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో దేవరపల్లి సర్పంచ్ కొరిటాల సురేష్, ఎంపీటీసీ కాపు రవి, డిప్యూటీ ఎంపిడిఒ జిఎస్‌డబ్ల్యూఎస్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని, ఎఒ శకుంతల, పంచాయతీ కార్యదర్శి పి చంద్రకాంత్, ముప్పాళ్ళ వెంకటరావు పాల్గొన్నారు.



ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు

నైపుణ్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని నక్షత్రనగర్‌లోని ఎంజేపీఏపీబీసీడబ్ల్యు (ఎఫ్‌జీ) పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. దేశంలో తొలిసారిగా విజయవాడలోని మురళీ రిసార్ట్స్‌లో రాష్ట్ర స్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొని మెరుగైన ప్రతిభ ప్రదర్శించారు. వ్యవసాయ (అగ్రికల్చర్) ట్రేడ్ విభాగంలో కె అక్షయ, కె సాయి చరిష్మ, కె ఈశ్వరమ్మ, సీహెచ్ వైష్ణవి, పి ఉమా వెంకటలక్ష్మి తమ ప్రాయోగిక నైపుణ్యాలు, సృజనాత్మకత, సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని చాటారు. వృత్తి శిక్షణ ఉపాధ్యాయురాలు సుద్దపల్లి సిరివెన్నెల మార్గదర్శకత్వంలో పోటీలకు సిద్ధమైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి రూ.15 వేల నగదు పొందారు. పాఠశాల హెచ్ఎం గుజ్జర్లపూడి రాగిణి విద్యార్థులు, ఉపాధ్యాయురాలును అభినందించారు. ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్, నిజాంపట్నం ఎంఈఓలు ఆర్ శోభాచంద్, శేషు గోపాలం విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలని, ప్లాస్టిక్ కవర్ల రహిత పంచాయతీగా తీర్చిదిద్దాలని ఇఒ ఎం శంకరరావు కోరారు. వర్తక వ్యాపారులు, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధిద్దాం, గుడ్డ సంచులు వినియోగిద్దాం అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
శనివారం 3 జనవరి 2026

సాగునీటి పారుదలకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేయూత

ప్రజాశక్తి - పంగులూరు

అధికారుల నిర్లక్ష్యానికి గురై మూడేళ్ల నుండి ఆలన పాలన లేక, సాగునీటి పారుదలకు ఆటంకంగా ఉన్న కాలువను ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్ తన సొంత డబ్బుతో బాగు చేయించి 150 ఎకరాల భూమి సాగులకు చేయూత అందించారు. అధికారులు చేయని పనిని ఒక సాఫ్ట్వేర్ ఇంజనీర్ చేయటం పట్ల ఆ గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నూజిలపల్లిలోని పగిడిపాడు మేజర్ కింద ఉన్న 3వ ఆర్ మైనర్ కాలువ గత మూడేళ్ల నుండి అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. నీటిపారుదలు లేకుండా ఉంది. గ్రామానికి దక్షిణం వైపున ఈ కాలువ ఒంగోలు రోడ్డులో చప్తా ఉంది. దీంట్లో మట్టి, చెత్తా, చెదారం నిండిపోయి, నీటి పారుదలకు ఆటంకంగా ఉంది. ఈ తూము గుండా చుక్క నీరు బయటకు రాకపోవడంతో 150 ఎకరాలకు చెందిన రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ రైతులు ఎన్నిసార్లు ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదు. ఈ కాలువకు వచ్చిన నీరు రోడ్డు దగ్గర గండిపడి వాగులోకి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పొలాలకు నీళ్ల



సాఫీగా నీటిపారుదల జరుగుతున్న సాగర్ కాలువ

పెట్టుకోవాలంటే గ్రామంలోని రామయ్య కుంట, ఊర చెరువు, ఎర్ర మాసుకుంట నుండి మూడు లిఫ్టులు ఏర్పాటు చేసుకొని నీళ్ల పెట్టుకోవాలి. ఇందుకుగాను ఒక్కో ఎకరానికి నీళ్ల పెట్టాలంటే రూ.10వేలు రైతులకు ఖర్చవుతుంది. గత మూడేళ్ల నుండి వేలల్లో ఖర్చుపెట్టి రైతులు పొలాలు సాగు చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన గ్రామానికి చెందిన పెంట్యాల ఆంజనేయులు కుమారుడు పెంట్యాల కొండలరావు అనే సాఫ్ట్వేర్ ఇంజనీరు తన సొంత డబ్బులతో నీటిపారుదలకు ఆటంకం గా ఉన్న తూములోని మట్టి, చెత్తా, చెదారం తీయించాడు. గండిపడిన కాలువ గట్టును పూడ్పించి అక్కడ మెటల్ తోలించాడు. దీంతో ఆ తూము గుండా నీటిపారుదలకు సుగమనమైంది. ఇప్పుడు నీరు నేరుగా కాలువలోకి ప్రవహిస్తుంది. ఈ 150 ఎకరాల భూమిలో రైతులు మొక్కజొన్న, ఎర్రజొన్న, మిర్చి, పొగాకు వంటి పంటలను సాగు చేశారు. గతంలో ఎకరాకు రూ.10 వేలు నీటి కోసం ఖర్చుపెట్టిన రైతులు, ఇప్పుడు ఎకరాకు రూ.5 వేలతో భూమిని తడుపుకుంటున్నారు. ఖర్చు తగ్గటంతో పాటు, శ్రమ కూడా తగ్గిందని రైతులు చెబుతున్నారు. తమ భూములకు సాగునీటి సమస్య పరిష్కారం చేసిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ పెంట్యాల కొండలరావును గ్రామానికి చెందిన రైతుల అభినందిస్తున్నారు.



పి కొండలరావు

ఫోకస్ ఐ కేర్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - రేపల్లె

పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్‌లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి సిఎం చంద్రబాబునాయుడు పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. తీర ప్రాంతంలో కంటి వైద్యానికి ఎన్టీఆర్ వైద్య సేవలను ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని తీర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కాగిత కిషోర్ బాబు



ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు శివప్రసాద్

మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు, కంటికి ఆపరేషన్లు చేయించుకోవచ్చని చెప్పారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు పెద్దపెద్ద పట్టణాలైన గుంటూరు, విజయవాడ వరకే పరిమితం కాదని, ఈ సేవలు మనకు చేరువు కావాలని, ఈ ప్రాంత ప్రజల కోసం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆపరేషన్ చేయించుకోవాలనుకున్నవాళ్లు ఆరోగ్యశ్రీ, ఆధార్, బ్యాంక్ డీటెయిల్స్ జిరాక్స్ తీసుకుని రావాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వసంత వీరరాఘవయ్య, డాక్టర్ మేక కోటేశ్వరావు, డాక్టర్ సుబ్బారావు, కె పిచ్చయ్య, డాక్టర్ వేములపల్లి రాజగోపాల్, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, యార్లగడ్డ రామారావు, సయ్యద్ కరిముల్ల పాల్గొన్నారు.

104 ఉద్యోగుల పోరాటానికి సంఘీబావం

ప్రజాశక్తి - అద్దంకి

ఎపిలో 104 సేవలు నిర్వహిస్తున్న భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం తీరును నిరసిస్తూ చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం తెలియచేస్తూ అఖిలపక్ష ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షులు వై నరేష్ అన్నారు. భవ్య హెల్త్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఎపిలో 104 కాంట్రాక్ట్ దక్కించుకున్నప్పటి నుండి ఈ ఏడు నెలల్లో కార్మికులను పూర్తిగా దోపిడీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. గత యాజమాన్యం ఇచ్చిన చివరి నెల వేతనం కొనసాగించాల్సిన బాధ్యత విస్మరించి ఆ జీతాల్లో కోతలు విధించింది. కార్మిక చట్ట ప్రకారం ఉద్యోగులకు అందాల్సిన క్యాజువల్ లీవ్‌లను పూర్తిగా రద్దు చేసిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన సిబ్బందిని తగ్గించి వేసింది. ఈ కారణాల వలన కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతుదని అన్నారు. తగ్గించించిన వాటిని పునరుద్ధరించాలని ఉన్నంతధికారులకు విన్నవించినట్లు



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు వై నరేష్

తెలిపారు. వెంటనే వచ్చిన మొదటి ఫలితం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని సస్పెండ్ చేసిందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సెలవులో ఉన్నప్పుడు, జిల్లా మేనేజర్ వాహన తనిఖీ పేరిట తనిఖీలు నిర్వహించి తప్పుడు అభియోగాలు మోపి అక్రమ సస్పెన్షన్ విధించారని అన్నారు. 104 సంస్థకే గాక, 108కు ఇదే యాజమాన్యం కాంట్రాక్టు దక్కించుకుదని అన్నారు. అందరూ అసంతృప్తిగా ఉండడమే యాజమాన్యం భయానికి అసలు కారణంమని, ఉద్యోగులూ వివిధ రూపాల్లో ఆందోళన నిర్వహిస్తున్నారు. డిఎం అండ్ హెచ్ఓ, కార్మిక శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకున్నారు. మీ సంఘం తరుపున, సంఘీభావం తెలపాలని, తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ 2న అన్ని సిఐటియు అనుబంధ సంఘాలు అన్నిటికి అఖిల పక్ష సమావేశం సిఐటియు కార్యాలయం వేదికగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నీ సంఘాలు ఈ అఖిలపక్ష సమావేశంకి హాజరై ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ చేసే నిరసన కార్యక్రమాలకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి తిరుపతిరెడ్డి, అంగనవాడి నాయకురాలు డి మనోలత, జిల్లా ట్రెజరర్ టీ ప్రతాప్ పాల్గొన్నారు.

రాంబాబు మరణం తీరనిలోటు

ప్రజాశక్తి - సంతమాగులూరు

వైసిపి చేనేత విభాగం మండల అధ్యక్షులు చిమటా రాంబాబు అకాల మరణం పార్టీకి తీరని లోటని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని మామిళ్ళపల్లికి చెందిన చిమటా రాంబాబు జనవరి 1న గ్రామం సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో పడి అకాల మరణం చెందాడు. శుక్రవారం జరిగిన అంతిమయాత్రలో అశోక్ కుమార్ పాల్గొన్నారు. రాంబాబు మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. అధైర్య పడవద్దని అన్నారు. వైసీపీ మండల కన్వీనర్ వూట్ల నాగేశ్వరరావు, సర్పంచి దివికోలు సుబ్బారావు పాల్గొన్నారు.

పాఠశాల బస్సు కింద పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ స్పిన్నింగ్ మిల్ ఆవరణలో బస్సు క్రింద పడి చిన్న బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్పిన్నింగ్ మిల్ ఆవరణలోని క్వార్టర్స్‌లో గత కొంతకాలంగా విశాఖపట్నం పాడేరు ప్రాంతానికి చెందిన పొంగి రమేష్ దంపతులు మిల్లు కార్మికులుగా పనిచేస్తున్నారు. ప్రతిరోజు మిల్లు క్వార్టర్లలో నివాసం ఉంటున్న కార్మికులు, ఉద్యోగుల పిల్లలను స్కూలుకు తీసుకువెళ్లేందుకు ఉదయం స్కూల్ బస్సు వస్తుంది. ఆ క్రమంలో గురువారం ఇంకొల్లు, గొల్లపాలెం రోడ్డులోని గౌతమి స్కూల్‌కు చెందిన బస్సు పిల్లల కోసం స్కూల్ ఆవరణలోకి వచ్చింది. పిల్లలను ఎక్కించుకొని వెళ్లే క్రమంలో బస్సు కింద రమేష్ 2వ కుమారుడు పొంగి ఓంకార్ వయసు ఐదేళ్లు. అనుకోకుండా ప్రమాదం జరిగింది. ఇది గమనించని బస్సు డ్రైవర్ వాహనంను కదిలించగా ముందు చక్రం కింద ఓంకార్ పడ్డాడు. బ్రతుకుతెరువు కోసం వస్తే తమ పిల్లవాడు బలైపోయాడని తల్లిదండ్రులతోపాటు బంధువులు రోదించారు. సంఘటనా స్థలాన్ని సీఐ వైవి రమణయ్య, ఎస్ఐ జి సురేష్ పరిశీలించి ప్రమాదానికి సంబంధించి సమాచారం సేకరించారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టంకు తరలించారు.



మృతికి కారణమైన బస్సు

4న విద్యోన్నతి ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి - పంగులూరు

ఈ నెల 4న పంగులూరు, ఇంకొల్లు, అద్దంకి మండలాల్లో విద్యోన్నతి ఫౌండేషన్ ప్రతిభా పరీక్ష జరుగుతుందని ఫౌండేషన్ డైరెక్టర్ దూళిపాళ్ల వీరనారాయణ శుక్రవారం తెలిపారు. పంగులూరు, ఇంకొల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాలు, అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు ఈ ప్రతిభా పరీక్ష రాసే అవకాశం ఉందని తెలిపారు. పరీక్ష ఆబ్జెక్టివ్ టైపులో మ్యాథమెటిక్స్, సైన్సు, సోషల్ స్టడీస్, తెలుగు, ఇంగ్లీషు జనరల్ అవేర్నెస్‌పై ఉంటుందని చెప్పారు. ఈ పరీక్ష ఉదయం 10 నుండి 11:30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. మూడు మండలాల్లో పరీక్ష రాసిన వారిలో ఒక్కో మండలం నుండి ఐదుగురిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన 15 మందికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం రూ.10వేలు, 2వ సంవత్సరం రూ.10వేలు చొప్పున ఒక్కొక్క విద్యార్థికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. ఈ పరీక్షకు మండలంలోని ఆరు జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి 62 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.



డి వీరనారాయణ

విఆర్‌ఒల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో విఆర్‌ఒల నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు సయ్యద్ కరీం, ఉపాధ్యక్షులు ఆర్ శ్రీనివాసరావు (వాసు), సెక్రటరీ ఎం రామబ్రహ్మం, కోశాధికారి రాధికా కృష్ణవేణి, జాయింట్ సెక్రటరీ జ్యోతి బాబు, పిచ్చయ్య, సిహెచ్ బిక్షాలు, జాయింట్ ట్రెజరర్ ఈ చైతన్య, కె కోటమ్మ, ఎం పూర్ణిమను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కరీం మాట్లాడుతూ విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా పనిచేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులను తహాశీల్దారు కె రవిబాబు, డిప్యూటి తహాశీల్దారు రాఘవరావు, ఆర్‌ఐ రామారావు అభినందించారు.



సయ్యద్ కరీం

హనుమోజిపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు శివారు గ్రామమైన హనుమోజపాలెంలో ఉప్పుగుండూరు లక్ష్మీదేవమ్మ (86) మృతి చెందారు. కుటుంబ సభ్యుల అనుమతితో పెద్దకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి ఆమె కార్నియాలను సేకరించారు. ఆమె భర్త రంగారావు, కూతురు నాగరాజుకుమారి, అల్లుడు దుర్గాప్రసాద్, శివాజీ, సురేఖను వైద్యులు, ఇంకొల్లు రోటరీ కార్యవర్గం సభ్యులు అభినందించారు.



యు లక్ష్మీదేవమ్మ (86)



మాట్లాడుతున్న ఎంపిడిఒ కె నేతాజి

ఆదిపూడిలో స్వామిత్వ గ్రామసభ

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని ఆదిపూడి పంచాయతీ కార్యాలయంలో స్వామిత్వ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. సభకు ఎంపిడిఒ కె నేతాజీ హాజరై మాట్లాడారు. సర్వే వివరాలు గ్రామ సభలో చర్చించారు. ఆస్తి కార్డుల జారీ ప్రక్రియలో గ్రామ ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్, లింగిశెట్టి కృష్ణ, స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ విజయానంద్

సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం

కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో...
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-మార్కాపురం

రాష్ట్రంలో ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం అమరావతి సచివాలయం నుండి పి.జి.ఆర్ఎస్ అర్జీల పరిష్కారం, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతప్తి పెంచే విధంగా అధికారులు పని చేయాలని కోరారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి వచ్చిన అర్జీల పరిష్కార వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరచాలని ఆయన అధికారులకు చెప్పారు. జిల్లాలో రైల్వే ప్రాజెక్టుల భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. మార్కాపురం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, జిల్లా రెవెన్యూ అధికారి బిసిహెచ్ ఓబులేసు, డిపిఒ వెంకటేశ్వర్రావు, విద్యుత్ ఎస్.ఇ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సూరిబాబు పాల్గొన్నారు.

4న 'దాచూరి' మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

శాసనమండలి మాజీ సభ్యులు దాచూరి రామిరెడ్డి స్మారక రెగ్యులర్ మెడికల్ క్యాంపు జనవరి 4వ తేదీ ఆదివారం నాడు ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు మెడికల్ క్యాంపు కన్వీనర్ మాదాల వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ శిబిరంలో బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం కలిగిన రోగులకు 2 నెలలకు అవసరమైన మందులు కేవలం రూ.200కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులో వివిధ విభాగాల్లో అనుభవం గడించిన ప్రముఖ వైద్యునిపుణులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ బి.హరిబాబు, డాక్టర్ యల్. జాన్ రిచర్డ్స్, డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ ఎస్. ధీరజ్ బాబు, డాక్టర్ ఎస్. సందీప్ ప్రకాష్, డాక్టర్ ఎం.శరత్, డాక్టర్ కె శ్రీధర్ బాబు, డాక్టర్ జి.చైతన్య, డాక్టర్ రంజిత్ బాషా, డాక్టర్ ఎస్.కె సమీర్ శర్మ, డాక్టర్ ఎం రవితేజ, డాక్టర్ ఎం సుందర్ ప్రసాద్, డాక్టర్ ఎం చైతన్యకృష్ణ తదితరులు పాల్గొని అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు వివరించారు. ఈ పాటికే వైద్యం పొందుతున్న రోగులు బిపి, షుగర్ వంటి రక్త పరీక్షలు చేయించుకుని ఆయా రిపోర్టులు తో పాటు, పాత మందుల చీటీలతో వైద్య శిబిరానికి రావాలన్నారు. కొత్తగా వచ్చే వారు వైద్య పరీక్షలు చేయించుకొని ఆ రిపోర్ట్, వారు వాడుకుంటున్న మందుల చీటీ, ఆధార్ కార్డు తెచ్చుకోవాలన్నారు. పేషెంట్లు ఈ మెడికల్ క్యాంపును ఉపయోగించుకుని వైద్య సేవలు పొందవలసినదిగా ఆయన కోరారు.

ప్రమాదాల నివారణ కోసం...

ముందస్తు చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-మార్కాపురం

జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మార్కాపురం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత మాసం క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 1 నుండి 31వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాన్ని నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జిల్లా రవాణాశాఖ అధికారి సుశీల, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

మార్కాపురం జిల్లా ఎక్సైజ్ అధికారిగా అయేషాబేగం

ప్రజాశక్తి-మార్కాపురం



అయేషాబేగం

మార్కాపురం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారిగా అయేషాబేగం నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారిగా పనిచేస్తున్న ఈమెకు ఇక్కడ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్డులోని పాతజిల్లా పరిషత్ సమావేశంలో జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. 11 గంటలకు ఒంగోలు ఏ1 కన్వెన్షన్ హాలులో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ 2026 కొత్త కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటలకు ఒంగోలులో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 5 గంటలకు ఎస్‌విజిఎస్ కళ్యాణ మండపంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు.



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న డిటిసి సుశీల, ఎంవిఐలు

స్వచ్ఛంద సేవకులకు

రహదారి భద్రతపై శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

37వ జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు సందర్భంగా రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో క్విస్ కాలేజ్ మరియు నెహ్రూ యువ కేంద్రం నుంచి మొత్తం 45 మంది స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవిఐలు కె.రామచంద్రరావు, సురేంద్ర ప్రసాద్, కె.జయప్రకాశ్ పాల్గొని స్వచ్ఛంద సేవకులకు రహదారి భద్రతపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ముఖ్యంగా రోడ్ సేఫ్టీ అవగాహన, ట్రాఫిక్ విద్య, ప్రథమ చికిత్స, క్రమశిక్షణ, సురక్షిత డ్రైవింగ్, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీ బస్ స్టాండ్లో నిర్వహించిన జాతీయ రహదారి భద్రతా మహోత్సవాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయ మోటారు వాహన తనిఖీ అధికారులు యు.ధర్మేంద్ర, కె.జయప్రకాష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం డి.శ్రీనివాస్‌రావు, ఆర్టీసీ ఓఎం రవికాంత్, సీఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి

- అంబేద్కర్ విగ్రహానికి వినతి
- శింగరాయకొండలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీ చేపట్టిన నాయకులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

గిరిజనుల శ్మశాన వాటికను కబ్జా చేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగంలో అంబేద్కర్ ఇచ్చిన హక్కులు అమలు కావటం లేదని, అందుకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ, యువ నేస్తం ఫౌండేషన్ చైర్మన్ అంకిపల్లి బంగారు బాబు, రైతు కూలీ సంఘం నాయకులు కోడూరు నాంచర్లు, ఎస్‌సి, ఎస్‌టి, విజలెన్స్ మానిటర్ మాజీ సభ్యులు పొట్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ సర్వేనెంబర్ 105/2లో ఎస్‌టిలకు శ్మశాన వాటిక కోసం ప్రభుత్వం కొంత స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థలం హైవేను ఆనుకొని ఉందన్నారు. ఫలితంగా దాన్ని ధర కోట్ల రూపాయలు పలుకుతున్నట్లు తెలిపారు. దీంతో ఈ స్థలంపై ఆక్రమణదారుల కన్నుపడినట్లు తెలిపారు. అందులో భాగంగా చాంద్‌బాషా అనే వ్యక్తి శ్మశాన వాటిక స్థలాన్ని చదును చేయించినట్లు తెలిపారు. గతంలోనూ స్మశాన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ ఘటనపై అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ తాజాగా రెండు రోజుల క్రితం శ్మశాన వాటికలో పూడ్చిన మతదేహాలను సైతం ట్రాక్టర్లతో దున్ని చదును చేయించినట్లు తెలిపారు. శ్మశాన వాటికను దున్నడం ఏమిటని ప్రశ్నించిన ఎస్‌టిలను ఆ స్థలం తనదని బెదిరింపులకు గురిచేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్‌టిల శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్రమణకు ప్రయత్నించిన చాంద్‌బాషాపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఎస్‌టికు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రేణుమాల మాధవ్ మాదిగ, శింగరాయకొండ మండల అధ్యక్షుడు రావినూతల వెంకటేష్ మాదిగ, కోకన్వీనర్ పొనుగోటి ఉదయ్‌కుమార్, మలవరపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సిఐటియు బహిరంగసభ జయప్రదం కోరుతూ..

ఎర్ర బెలూన్లు ఎగరవేత

ప్రజాశక్తి-మార్కాపురం

సిఐటియు అఖిల భారత మహాసభలు విశాఖపట్నంలో గత నెల డిసెంబరు 31న ప్రారంభమ య్యాయి. ఈ నెల 4వ తేదీతో ముగియనున్నాయి. చివరి రోజున (4వ తేదీన) విశాఖ నగరంలో భారీ బహిరంగ సభ జరగనుంది. సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మార్కాపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఎర్ర బెలూన్‌లను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం రఫి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు రెండు వేల మంది వరకు కార్మిక నాయకులు పాల్గొంటారన్నారు. ప్రపంచంలోని సుమారు 10 దేశాల నుంచి కార్మిక పోరాట యోధులు పాల్గొంటారన్నారు. మహాసభల ముగింపు రోజున భారీ బహిరంగ సభ కనీవిని ఎరుగని రీతిలో జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించడం, వాటి పరిష్కారానికి పోరాటాల రూపకల్పన జరుగుతుంద న్నారు. ఆదివారం విశాఖ నగరంలో జరుగుతున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో-కన్వీనర్ కె సుబ్బరాయుడు, జి హరి, చెన్నకేశవులు, పి శ్రీను, ఎం చెన్నకేశవులు, కనకయ్య, శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, ఎం శ్రీను పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా విశాఖలో జరిగే ర్యాలీ, బహిరంగసభకు ప్రజలందరూ తరలిరావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం హనుమంతునిపాడు సెంటర్‌లో చలో విశాఖ బహిరంగ సభ కరపత్రాలు ఆయన పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ బహిరంగ సభకు సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కామ్రేడ్ కే హేమలత, సిఐటియు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, (ఎక్స్ ఎంపీ), సిఐటియు అఖిల భారత కోశాధికారి కామ్రేడ్ ఎం సాయిబాబు, సిఐటియు ఆల్ ఇండియా కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్ నరసింగరావు, కామ్రేడ్ యలమరం కరీం (ఎంపీ) సిఐటియు అఖిల భారత మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎంఏ గఫూర్ (మాజీ ఎమ్మెల్యే) సిఐటియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఏవీ నాగేశ్వరరావు తదితరులు హాజరవుతున్నారు.